# పరాజిత

రచన:
శ్రీ సి. దన్నయ్య

ఆమె, ఎంట ఒకఆరేళ్లపిల్ల ఆనగరంలో ఎక్జిబిషన్ సంబరంలో మెల్లమెల్లగా వాడవాడ తిరుగుతున్నారు. చేతిలో ఒకమూటయుంది, కట్టుగుడ్డలు బొత్తిగా చీలికలు, పీలికలుగానున్నవి. పిల్లకేదో కొనిడబ్బుకు కొనిపెట్టినట్లున్నది- తింటూ ఆమెవెంట నడుస్తున్నది. ఆమెనుచూచి అనేకులు పిచ్చిబాగుల దనుకొనియుంటారు. ఆమెముఖంమీద తాండవిస్తున్నకళ, ఆమె చూపులు, అప్పుడప్పుడు ఆమెనవ్వేనవ్వు వికృతంగా కనుపిస్తున్నవి. పిల్ల, జల్లలను వెంటబెట్టుకొని వచ్చినవారు ఆమెనుచూచి పిల్లలు భయపడతారేమోనని తొలగేసుకొనిపోతున్నారు.

నేను, మాఆవిడ పిల్లలతో ఆఎక్జిబిషన్ ఆవరణలోనే తిరుగుతున్నాము. కాని అప్పటివరకు నేనామెను అంత పరిశీలనగా చూడలేదు. మేమంతా తండోపతండాలుగా రంకులరాటము దగ్గర గుమిగూడాము. రమ, కనకమ్మ రాట్నమెక్కి తిరగాలని మారాం పెడ్తున్నారు. నేను, వాళ్ళమ్మ ఎంతచెప్పినా వినడంలేదు. చిన్నమ్మాయి నాచేతుల్లోనుండి క్రిందికి దిగకుండా భీష్మించుకొని కూర్చున్నది. ఈకోలాహలంలో ఆపిల్లతోటి, ఆమె నాముందుకువచ్చి నిలబడియుండటం నాదృష్టికి వచ్చింది. ఆమెమాత్రం నన్నుచూడలేదు. చూచినట్లయితే ఎంత ఆప్యాయంగా పలుకరించేదో! మమ్ములను చూచి ఎంత ఆనందపడేదో!—దాంతోపాటు ఎంత అసూయకు, విచారమునకు గురిఅయ్యేదో!

నేనామెను తేరిపారచూడలేక పోయాను. నాలోని మానసిక దౌర్బల్యము కాబోలు!—ఎందుకో ముందుకు పొమ్మని నెట్టింది. ఆమెకంటబడకుండా తప్పుకోవాలనే ఆదుర్దాకొద్దీ కాళ్ళు చరచర నడువసాగినవి. నా వెంబడి పిల్లలు, మాఆవిడ గొణుగుకుంటూ, రుసరుసలాడుతూ నడువసాగారు. ఆమె మాచూపుకు మరుగు పడిపోయింది; కాని నాహృదయభారం మాత్రం తగ్గలేదు.

“మేమేమైనా కొనిపెట్టమని అడుగుతామని నాన్న గబగబ ముందుకు పరుగెడుతున్నాడమ్మా”! అన్నది కనకమ్మ.

“ఏమిటండీ! యీపరుగులు తీయడం—ఏమికొనక పోయినా చూడనైనా చూడనివ్వరేం” అన్నది కాంతం.

అశ్రుపూరితాలయిన కండ్లను తుడుచుకుంటూ “కాంత్! రంగులరాట్నముదగ్గర మనముందొక స్త్రీ పిల్లను వెంటబెట్టుకొని యుండింది చూచావా” అన్నాను.

“ఎవరండీ!—ఎవరో బిచ్చగత్తెకదా!”

“అవును—యీనాడు బిచ్చగత్తె, ఆమెఎవరో, ఎలాగపెరిగిందో, యిప్పుడీగతి ఎందుకుపట్టిందో నాకు తెలుసు—నీకేం తెలుసు! నీవామెచరిత్ర వింటే ఎంతగానో విచారపడతావు”

“అంటే......”

ఆమైదానంలోనే ఒకప్రక్కన బహిరంగ నాటక ప్రదర్శనము జరుగుతున్నది. స్త్రీలు, పురుషులుకూడ ఎగబడిచూస్తున్నారు. మాముగ్గురు పిల్లలను ఒకప్రక్కగా కూర్చొనబెట్టి మేము సమీపంగా ఒకచోట కూర్చున్నాము.

“కాంత్! ఆమెఎవరోకాదు—మా మేనమామ కుమార్తె. ఆమెను వాళ్ళనాన్న ఎంతోగారాబంగా పెంచాడు. మిగిలిన పిల్లలను ఒకరకంగాను, ఆమెను ప్రత్యేక శ్రద్ధ; ప్రేమానురాగాలతో పెంచాడు. మణి ఏడుస్తున్నదంటే మామామ వలవల ఏడ్చేవాడు. తను తినే ముద్దలోకూడ మణికి భాగంపెట్టేవాడు. ఆమె చిన్నప్పుడు తనగుండెలమీద పండుకోబెట్టుకొని నిద్రబుచ్చేవాడు. తను ఏదితెచ్చినా; యింట్లో ఏదిచేసినా మణికి ముందుపెట్టికాని తనైనా తినేవాడుకాడు.

మణికి క్రమంగా పెండ్లియీడువచ్చింది. తండ్రి సంబంధాలకని వెతుకులాడ మొదలుపెట్టాడు. బంగారంలాంటి అనేక సంబంధాలు వచ్చినవికాని తల్లి తన పుట్టింటి ప్రాంతంలో యిచ్చిచేయాలనే ఉద్దేశం మనసులో పెట్టుకొని ఏవో కుంటిసాకులు, ఎన్నికలుపెట్టి చెడగొట్టింది. తండ్రికిమాత్రం మణిని దగ్గరప్రాంతంలో యిచ్చిచేస్తే రాకపోకలకు అనుకూలంగా నుంటుందనీ, తనపిల్ల యించుమించుగా కండ్లఎదుటనున్నట్లుగా నుం

డాలని పట్టుదల. ఎలాగైతేనేం విశ్వప్రయత్నముచేసి సంబంధము మాట్లాడి ముహూర్తాలు పెట్టుకొని వచ్చాడు మణితండ్రి. మేళాలు, తాళాలు, అశేషబంధుమిత్ర బలగంతో వైభవంగా వివాహమయింది. వరుడుయీడు జోడైనవాడైనా, చదువుకున్నవాడైనా, గౌరవనీయమైన కుటుంబమునందలివాడైనా తనయిష్టాన్ని పాటించకుండా పెండ్లి జరుగుతున్నదని పెండ్లిజరుగుతున్నంతసేపు ఏడుస్తూనేయుండింది మణితల్లి.

సంవత్సరము తీరానిండలేదు. హటాత్తుగా పది రోజులు జ్వరముతగిలి మణిభర్త చనిపోయాడు. దాంతోటి మణితండ్రి కడుపుచెరువైంది. బాగా 13 సంవత్సరాల వయస్సులేదు—పెండ్లంటేఏమిటో, అత్తగారియిల్లంటే, వైవాహిక జీవితమంటే ఊహించకలిగిన వయస్సయినాకాదు. ఇకఆమె భవిష్యత్తు ఏమిటి? అత్తగారియింటనైనా చెప్పుకోతగ్గ ఆస్తిపాస్తులులేవు. పెండ్లప్పుడు పెట్టిన వెయ్యిరూపాయలు నగలు మాత్రం నిలబడ్డవి వారిచేతిలో. ఆమె కలకాల జీవితము ఎలా సాగాలా!—అనే చింతతో పిచ్చివాడైపోయాడు మణి తండ్రి.

మా మామ ఛాందసుడు. వృత్తి పౌరోహితము. ఆయన మణికి పునర్వివాహము తలపెట్టగలదనేది ఊహించరానిది. పైగా ఆరోజుల్లో వితంతు వివాహాలను ధైర్యంగా సమర్థించ కలిగినవారు చాల కొద్దిమంది. ఒకవేళ బహిరంగంగా కొందరు సమర్థించినా స్వయంగా వివాహం చేసికొనడానికి సిద్ధపడేవారుకాని, చేయకలిగేవారు మరీ అరుదు. ఈ పరిస్థితులలో మణి పునర్వివాహం చేస్తానని ఆమె తండ్రి ఏలా సాహసించకలుగుతారని అనుకుంటాము?

మణి తండ్రి ఆమె దిగులుతో క్రుంగి క్రుసించిపోయి గుండె జబ్బుతో చనిపోయాడు.

మణి అన్నయ్య మద్రాసు నగరంలో ఉద్యోగం చేస్తున్నవాడు. చదువుకొని పట్నమాసపువాతావరణా


**THE UNITED INDIA LIFE ASSURANCE CO., LTD.**

**(Established 1906)**

**H. O.—MADRAS.**

Trustee for the Policyholders'
Trust Fund:
THE OFFICIAL TRUSTEE OF MADRAS.

"United India" serves all your Insurance needs.
Specialised in STAFF INSURANCE SCHEMES.

**New Business completed in 1954 exceeds Rs. 5,31,00,000.**

Branches all over India, Ceylon, Malaya etc.

*Agency in this Progressive Life Company is offered to hardworking and ambitious youngmen.*

For particulars, apply to:
*The Branch Manager,*

**UNITED INDIA LIFE ASSURANCE CO., LTD.,**

**P. B. 281, :: MADRAS-1.**

నికి అలవాటు పడినవాడు కావడంచేత అభ్యుదయ భావాలు కలవాడు. తండ్రి చనిపోంగానే చెల్లెలిని మద్రాసుకు పిలుచుకొని వెళ్లి చదువు చెప్పించాలని విద్యాలయంలో చేర్చాడు. రాత్రిం పగళ్లు ఆమె విద్యాభివృద్ధులకు ఆరాటపడేవాడు. అయితే లాభమేముంది?—మణికి చదువుమీద ధ్యాసలేదు. ఎప్పుడూ ఒక మూల విద్యాలయంలో కూర్చొని తనలో తాను తోచినప్పుడు మాట్లాడుకొంటుండేది ఉపాధ్యాయులు చెప్పే చదువు ఏ మాత్రం ఆమె బుర్రకంటేది కాదు. ఎవరేమి పలకరించి నా వారితో మాట్లాడేది కాదు. నయాన, భయాన పాఠశాల నిర్వాహకులు; ఉపాధ్యాయ వర్గము మణికి విద్యాబుద్ధులుగరపాలని ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది. ఒక రోజున విద్యాలయంలో ఎవరికీ తెలియకుండా పరారియై అన్నయ్య పనిచేస్తున్న ఆఫీసుకు చేరి భోరున ఏడువసాగింది.

మణి అన్నకిదంతా అయోమయంగా నుండింది. చెల్లెలిని ఎంతో బుజ్జగించాడు. అప్పటికిని ఆమె ఏడ్పు ఆగలేదు.

"నాకు చదువు వద్దు; పెండ్లి చెయ్యి" అని వల వల ఏడ్వసాగింది.

ఆయనకు పిచ్చి పట్టినట్లయింది. యీ రగడనుచూచి తోటివారు నవ్వుతారనే బాధ ఒక ప్రక్క వేధించింది. మెల్లగా యింటికి తీసికొని వెళ్లాడు. మరల విద్యాలయంలో ఆమెను చేర్చాలని ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది. ఇకదరి, డొంకతోచక తీసికొనిపోయి అమ్మమ్మగారి యింట్లో వదిలేస్తే మేనమామ విద్యాబుద్ధులు చెప్తాడుకదా యని పిలుచుకొనిపోయి వదిలేసి వచ్చాడు.

ఇక నేం అక్కడ, అమ్మమ్మ ఆమెతో అమ్మ చేరి అలివేలు మంగాపురంలో భగవత్సన్నిధిన మణికి పెండ్లి అంటూ చేశారు.

"అయిందమ్మ పెండ్లి, అణిగిందమ్మ రంధి" అన్నట్లు పెండ్లయినట్లనిపించింది. తీరా తెలిసినవి వరాలేమిటంటే మణిని పునర్వివాహం చేసికున్న వానికి భార్య, ఒక బిడ్డయున్నారట. మామగారికి, అతనికి ఏదో కీచులాటవచ్చి భార్యను కోరినప్పుడు పంపకపోయే సరికి అలిగివచ్చి మణిని వివాహమాడడానికి తయారయ్యాడు. తానిక ముందు మొదట భార్యను ఏ పరిస్థితులలోను ఏలుకోను భగవంతుని ఎదుట ప్రమాణం చేసి మణిని వివాహమాడాడు.

ఒకటి; రెండు సంవత్సరాలు మణి తన భర్తతో సుఖంగానే కాపురంచేసింది. ఏ గొడవలు లేవు. ఇంతలో గర్భవతి అయి పిల్లను కన్నది. కాని పాపంపురిట్లో కాళ్ల, చేతుల కీళ్లుపట్టుకొని పోయినవి. లేవలేదు—కూర్చోలేదు—నడువలేదు బొత్తిగా మంచంలోని బ్రతుకయింది. మణి అన్న, భర్తకూడ ఆమెకు చికిత్సకని చాల శ్రమపడ్డారు; డబ్బు ఖర్చుపెట్టారు. కాని స్వస్థత చెందుతున్న చిహ్నాలు కనుపించలేదు. దాంతో మణి భర్తలోనిస్పృహ, విరక్తి సూచనలు పొడగట్టసాగినవి. దీనిని గమనించి మొదటి భార్య తరఫు అత్తగారు, మామగారు రహస్యంగా రాయబారాలు జ..పసాగారు ఆయనతో. ఉన్నట్లుండి మణి భర్త భార్యను వదిలేసి పరారియైనాడు.

మణి భర్తను వెదుక్కుంటూ అమ్మ, అన్న మణిని వెంటబెట్టుకొని అతని స్వగ్రామానికి వెళ్లారు. ఆయనకేం—స్థిమితంగా మొదటి భా ్యతో నున్నాడు.

'యేం మర్యాదయ్యా! యిది! మొదటిభార్య నేలుకోనంటేకదా మా అమ్మాయిని నీకిచ్చి చేసింది! ఇప్పుడు నీ విలా మోసం చెయ్యటం ద్రోహం కదూ!' అన్నది మణి తల్లి.

అయితే మీర నేది—కాళ్లుచేతులులేని మీ అమ్మాయి జీవితంతోపాటు నా జీవితాన్నికూడా నిర్వీర్యంచేసికోమనా' అన్నాడు ముఖం చిట్లిస్తూ.

'అలాగంటే ఎలాగా బావా! యేదో జబ్బుచేసింది కాబట్టి ఇప్పుడట్లాయుంది—ఇవ్వాళ కాకపోతే రేపు నయంకాకపోతుందా' అన్నాడు మణి అన్న.

యేమి చెప్పడానికి పాలుపోలేదు.

'సరే మణినికూడ వదిలేసి పోండి—ఇద్దరూ యేదో యుంటారు.'

మణిని అక్కడ వదిలేసి తల్లి స్వగ్రామానికి, అన్న మద్రాసుకు వెళ్లారు.

నాలుగయిదు నెలలో మణి మెళ్ళోని నానుపేట, చెవుల కమ్మలు అమ్మడం, ఖర్చు పెట్టడం జరిగింది. ఆమెదగ్గర యిక గురిగింజఎత్తు బంగారముకూడా లేదు.

ఒక రోజున పుట్టింటికి పిలుచుకొని వెళ్తానని మణిని బిడ్డతో సహా వెంటబెట్టుకొని రైలులో వెళ్లి తనూ వాళ్లతోపాటు దిగినట్లే దిగి బండి కదలబోయేటప్పుడు ఇంకొక పెట్టెలో ఎక్కి మణిని వదిలేసి పోయాడు.

మణి, బిడ్డ భోరున యేడ్వసాగారు. స్టేషనుమాస్టరు, గుమాస్తాలు చందా వేసుకొని బండిమాట్లాడి పుట్టింటి గ్రామానికి ఎక్కించి పంపారు.

మణిని చూడంగానే తల్లి ఆశ్చర్యపడింది. ఎందుకు వచ్చావని అడిగింది. జరిగిన సంగతిని చెప్పేసరికి 'నేను నిన్నెక్కడ పోషించేది! వెళ్లిపో' అని ఇంట్లో నుండి బయటికి గెంటేసింది.

'పోయినది పోగా ఇంకా నా సొమ్ము మీ దగ్గర యున్నది కదా!—నాది నాకిచ్చెయ్యండి' అన్నది.

'ఆ సంగతి నాకు తెలియదు—మీ అన్నయ్యను అడుగు' అని తలుపు తాళం వేసుకొని ఎక్కడికి పోయిందో అంతు లేదు.

నాలుగురోజులు ఆ ఇంటిముందున్న వేపచెట్టు నీడన అలమటించి, ఆయమ్మ, ఆయమ్మ పెట్టిన మెతుకులు తిని ఇరుగుపొరుగువారు దయతలచి పిలుచుకొని రైలు ఎక్కించి పంపిస్తే ఎక్కడికిపోయిందో, ఎక్కడెక్కడ తిరిగిందో—యీ రోజున ఇక్కడ కనుపిస్తున్నది పాపం! అప్పటినుంచే ఈ విధంగానే తిరుగుతున్నది' అన్నాను.

'అమ్మా! తమకు నిద్ర వచ్చి కునుకుపాట్లు పడుతున్నది' అంటూ కనకమ్మ రమను వెంటబెట్టుకొనివచ్చింది.

అందరం లేచి ఇంటికి బయలుదేరి వెళ్ళాం.

* * * *

ఆరు నెలలు గడిచిన తరువాత ఒక రోజున పేపరు చదువుతుంటే అందులో 'ఎవరో అనాథ—చిత్తూరు సమీపంలో రోడ్డుప్రక్కన చెట్టుక్రింద చనిపోయి పడియుంది. ఆమె ప్రక్కన యేడుస్తున్న పిల్లను క్రిస్టియన్ మిషనరీలు తీసికొనివెళ్ళి పెంచుతున్నారు' అని యున్నది.

'పాపం, ఆమె మణి అయియుండాలి!'

మా ఆవిడ గదిలోకివస్తూ 'యేమిటండీ అంత తదేకధ్యానంగా చూస్తున్నారు పేపర్లో' అన్నది.

పేపరు ఆమెకు యిచ్చి 'ఇదుగో యిది చూడు' అని 'మనం ఎగ్జిబిషన్ చూడడానికి పోయిననాడు చూస్తిమే......' అన్నాను.

'అదేమిటండీ!—యిలా దిక్కులేని చావు వచ్చింది!—ఆమెకిచ్చిన వెయ్యిరూపాయల సొమ్ము యేమైందో'!

దాన్ని అనుభవించినవాళ్ళు అనుభవించారు. పాపం. చివరికి కాగలి వచ్చింది మణి' అన్నాను.

మీరు వాటిని ఏ విధముగా చూచినా....

మెక్డోవెల్స్

కలర్, సోడా పానీయములు అత్యుత్తమమైనవి

అవి మీ దాహమునుతీర్చి ఉల్లాసము నిచ్చును.